క్లుప్తంగా

అబాకస్ పోటీలలో ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ శివతులశమ్మ

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో భాగంగా విజయవాడలో నిర్వహించిన అబాకస్ పోటీలలో కడప నాగార్జున ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ప్రతిభ చాటారు. విజులైజేషన్‌లో రేయాన్‌ఖాన్ ద్వితీయ, స్టార్ జూనియర్ లెవెల్ 3లో కాశ్విరెడ్డి, ఆయుష్‌పాల్, జూనియర్ లెవెల్-3లో మోక్షితారెడ్డి తృతీయ బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివతులశమ్మ, డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, హెడ్ మిసెస్ సుశీలదేవి విద్యార్థులను అభినందించారు.

ఎస్‌ఏలకు ప్రాధాన్యం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: సర్వశిక్ష అభియాన్ పరిధిలోని ఐఈ–కో ఆర్డినేటర్ నియామకంలో స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సివి ప్రసాద్, జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వర చంద్ర, ఆలీఖాన్ కోరారు. గతంలో సర్వ శిక్ష అభియాన్‌లో ఐఈడీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్)పోస్టుకు డీఎస్సీ రాసినప్పుడు వెయిటేజ్ పాయింట్లు ఇచ్చారని తెలిపారు.

పెన్షన్ మంజూరుచేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు పెన్షన్ మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ.సుదర్శన్‌రెడ్డి అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధర లభించక కౌలు మొత్తం కట్టలేని పరిస్థితిలో కౌలు రైతులు ఉన్నారన్నారు.

పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఓటమా...?

బీటెక్ రవి వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ నేత బూసిపాటి కిషోర్



విలేకరులతో మాట్లాడుతున్న బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్: పులివెందుల నియోజకవర్గంలో వైఎస్ కుటుంబానికి ఓటమే ఉండదని... వైఎస్ జగన్‌ను ఓడిస్తామంటూ టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, వల్లూరు మాజీ సర్పంచ్ బూసిపాటి కిశోర్ ఎద్దేవా చేశారు. కడపలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అబద్ధాలు చెప్పడం, ప్రజలను మభ్య పెట్టడం, బిల్డప్ కొట్టడంలో బీటెక్ రవి చంద్రబాబును మించిపోయారన్నారు. నియోజకవర్గంలో ప్రతి అభివృద్ధి వెనక వైఎస్‌ఆర్ కుటుంబం ముద్ర ఉందని, అలాంటి వాస్తవాన్ని మరిచి వైఎస్ కుటుంబంతో పులివెందుల సమస్యల్లో చిక్కుకుందని చెప్పి మాట్లాడడం గర్హనీయమన్నారు. ఎంతో కడప జిల్లా మొత్తాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్, వైఎస్ జగన్‌లకే దక్కుతుందన్నారు. కొప్పర్తితోపాటు జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల ఏర్పాటుకు ఎంతగానో కృషి చేశారన్నారు. కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక డబ్బులు లేవంటూ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి జిల్లా కేంద్రం స్థాయిలో తీర్చిదిద్దితే, కూటమి అధికారంలోకి వచ్చాక చిన్న పెండింగ్ పనులు పూర్తి చేయలేక చేతులెత్తేసిందన్నారు. మెడికల్ కాలేజీ కడితే దానికి వచ్చిన 50 మెడికల్ సీట్లను వద్దని లేఖ రాసిన ప్రభుత్వం చంద్రబాబుదేనన్నారు. కూటమి గాలిలో పోటీ చేస్తేనే బీటెక్ రవి 64 వేల ఓట్లతో ఓడిపోయారని, ఇపుడు తొమ్మిది నెలల కూటమి పాలన చూశాక వారికి ఎవరైనా ఓటేస్తారా...అన్నారు. ప్రతిపక్షాన్ని మాటలతో దూషించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీలు అమలు చేయని ప్రభుత్వం... వైఎస్ జగన్ అసెంబ్లీకి వెళ్తే ఎక్కడ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని భయాందోళనతో ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు. ఉప ఎన్నికలు వస్తే వైఎస్ జగన్ ఓడిపోతారని తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయం



జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగయ్య యాదవ్

కడప కార్పొరేషన్: తమరు మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, దాసరి శివ ప్రసాద్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం పులివెందుల హెలీప్యాడ్ వద్ద కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తాము చేసిన సేవలను గుర్తించి తమకు జిల్లా కమిటీలో ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా



జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని వైఎస్సార్ సీపీ నేత జయచంద్రారెడ్డి తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన ప్రత్యేకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకముంచి పార్టీ పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని, పార్టీపై జరుగుతున్న విష ప్రచారాన్ని సమర్థవంతంగా అడ్డుకుంటానని తెలిపారు.

కమిషనర్‌కు డైరీ అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన విజయ సేవా సమితి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి మంగళవారం మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర టీటీడీ డైరీ, క్యాలెండర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌కు తమ కార్యకలాపాలు వివరించారు. కమిషనర్ శ్రీనివాసులురెడ్డిని అభినందించారు.

7న చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రంలో ఏఎన్‌ఎం పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 7వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఏఎన్‌ఎం పూర్తిచేసి వయోపరిమితి మీరిపోతున్న వారంతా మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఏఎన్‌ఎం పూర్తిచేసి ఆశాలుగా పని చేస్తున్న వారికి నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

యాప్‌లో డబ్బు విషయమై అన్నదమ్ముల ఘర్షణ

ప్రొద్దుటూరు క్రైం: యాప్‌లో డబ్బు పెట్టుబడి విషయమై గణేష్ నగర్‌లో ఘర్షణ చోటు చేసుకుంది. ఓ యాప్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే కొన్ని రోజుల వ్యవధిలోనే రెట్టింపు అవుతుందని బెంగళూరుకు చెందిన వ్యక్తి చెప్పడంతో మండలంలోని గణేష్ నగర్‌కు చెందిన ఇరువురు అన్నదమ్ములు రూ.15 లక్షలు పెట్టారు. అనంతరం వీరికి సమీప బంధువైన చాపాడు మండలానికి చెందిన మరో వ్యక్తి రూ.40వేలు పెట్టుబడి పెట్టాడు.

ఇటీవల యాప్‌కు సంబంధించిన వ్యక్తుల ఫోన్ పని చేయకపోవడంతో మోసపోయామని అన్నదమ్ములు గ్రహించారు. మిమ్మల్ని నమ్మి నేను కూడా పెట్టుబడి పెట్టానని చాపాడు మండలానికి చెందిన వారి బంధువు అన్నదమ్ములతో గొడవకు దిగారు. ఈ క్రమంలోనే వీరి మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకోగా ఇటుకలతో కొట్టుకున్నారు. ఘటనపై రూరల్ పోలీసులు వారిని పట్టుకుని విచారణ చేస్తున్నారు.

శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు



మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తులకు ఏపీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. పొలతల, నిత్యపూజకోనతోపాటు ఇతర శైవ క్షేత్రాలకు కడప ఆర్టీసీ, పాత బస్టాండ్ల నుంచి బస్సులు నడుపనున్నారు. ఈ సందర్భంగా బస్టాండు ఆవరణలో ప్రత్యేకంగా చలువపందిరి ఏర్పాటు చేసి సమాచారం అందిస్తున్నారు. అలాగే బస్సుల రాకపోకల్లో ఆలస్యం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

– కడప కోటిరెడ్డిసర్కిల్:

బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేద్దాం



వీసీని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని పాఠకులు, సాహితీ వేత్తలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఫణితిప్రకాశ్ బాబు అన్నారు. మంగళవారం కడపలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సిబ్బంది వీసీని ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత సంచాలకులు ఆచార్య జి.పార్వతి గ్రంథాలయం, ఉద్యోగుల వివరాలను ఆయనకు వివరించారు. ఆచార్య ఫణితి ప్రకాశ్ బాబు మాట్లాడుతూ బ్రౌన్ చేసిన సాహితీ కృషి ఘనమైనదని కొనియాడారు. తాళపత్ర గ్రంథాలు భద్రపరచి పరిశోధకులకు అందుబాటులో ఉంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరి భూషణ రావు, ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, హరికృష్ణ, శ్రీనివాసులు, అరుణ, సుమతి పాల్గొన్నారు.

మహాదేవుడి పూజకు వేళాయె

కడప కల్చరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శివాలయాల్లో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, దాతలు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం పండగ సందర్భంగా కొన్ని చోట్ల రెండురోజులు, మరిన్ని చోట్ల మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించన్నారు. కడప నగరంలోని శివాలయాలు మహా శివరాత్రి పండగకు ముస్తాబయ్యాయి. నగర కమిటీలు, దేవదాయశాఖ అధికారులు, భక్త బృందాలు తమ సమీపంలోని ఆలయాల్లో శివ పూజకు ఏర్పాట్లుచేశారు. మామిడాకుల తోరణాలు, పూలతో ఆలయాలను అలంకరించారు. మరిన్ని చోట్ల అర్ధరాత్రి లింగోద్భవ సమయం తర్వాత శివుడిని అలంకరించేందుకు సరంజామాను సిద్ధం చేసుకున్నారు. ఉదయం, సాయంత్రం, మరిన్ని చోట్ల శివపార్వతుల కల్యాణం జరిపేందుకు ప్రత్యేక వేదిక సిద్ధం చేశారు. పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ఆలయం ఎదుట, పరిసరాల్లోనూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చలువ పందిరి ఏర్పాటుచేసి తాగునీరు అందుబాటులో ఉంచారు. రద్దీ ఎక్కువగా ఉండే ఆలయాల్లో భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనాలు కల్పించేందుకు ప్రత్యేకంగా బ్యారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటుచేశారు. కమిటీ పెద్దల సహకారంతో ఉదయం, సాయంత్రం తీర్థ ప్రసాదాలకు లోటు లేకుండా తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రముఖ ఆలయాలలో అన్నదానం చేయనున్నారు.



రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

ఆలయాల్లో పూజలు: నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సామూహికంగా రుద్రాభిషేకాలు జరిపారు బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హోమ గుండంలో సామూహిక హోమాలు నిర్వహించనున్నారు. మహాలక్ష్మి, సరస్వతి, ఆదిత్యాది నవగ్రహ, రుద్ర హోమాలు జరుపనున్నారు. రాత్రి 7 గంటల నుంచి శివపార్వతుల కల్యాణం నిర్వహించేందుకు వేదిక ఏర్పాటుచేశారు.

దేవుని కడపలో : దేవుని కడపలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేస్తారు. ఉదయం 10 గంటల నుంచి శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుంది. సాయంత్రం 5.30 గంటలకు రథోత్సవం, రాత్రి 12.05 గంటలకు స్వామికి అభిషేకం నిర్వహించనున్నారు.

హౌసింగ్ బోర్డులో

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో శివుడికి బుధవారం ఉదయం 7 గంటలకు నగర సంకీర్తన నిర్వహించనున్నారు. ఇటీవల కుంభ మేళా నుంచి తెచ్చిన పుణ్య నదీజలాలతో నింపిన 108 కలశాలను ధరించి భక్తులు పాల్గొంటారు. 9 గంటలకు బిల్వార్చన, రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం నిర్వహించ నున్నారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో పవిత్రమైన నదీ జలాలతో శివమూర్తికి అభిషేకించనున్నారు. అభిషేక జలాలను చల్లి సంప్రోక్షణ నిర్వహించనున్నారు.

నబీకోటలో : నబీకోటలోని మల్లికార్జునస్వామి, సర్వమంగళాదేవి ఆలయంలో బుధవారం ఉదయం 3గంటల నుంచి 10 గంటల వరకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం, 10 గంటలకు శిఖరపాగ దర్శనం, 11.45 గంటలకు లింగోద్భవ పూజలు నిర్వహిస్తారు.

ప్రకాశ్‌నగర్‌లో: ప్రకాశ్‌నగర్ అమరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 4 గంటల నుంచి అభిషేకాలు, 9 గంటల నుంచి గణపతి, గౌరీ, రుద్ర, మహా మృత్యుంజయ, ఆయుష్షు, నవగ్రహ హోమాలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, 12 గంటలకు రుద్రాభిషేకం నిర్వహిస్తారు. 27న మధ్యాహ్నం 12.00 గంటలకు అన్నదానం, సాయంత్రం 3.00 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

గడ్డిబజారు ఆలయంలో: గడ్డిబజారులోని కామకోటి కళాంబదేవి, సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు రుద్రాభిషేకం, అనంతరం శివ పార్వతుల కల్యాణోత్సవం, రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 12 గంటలకు రుద్రాభిషేకం, సహస్ర రుద్రార్చన నిర్వహిస్తారు. 27న సాయంత్రం 6 గంటలకు పుష్పాభిషేకం, లింగోద్భవ కాలంలో అర్చించిన రుద్రాక్షలను భక్తులకు పంచి పెట్టనున్నారు. రామచంద్రయ్య కాలనీలోగల అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రం, మారుతీనగర్‌లోని మహాకాళేశ్వరాలయంలోపూజలు జరుగుతాయి.

పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించేటప్పుడు రోస్టర్ పాయింట్లను ప్రకటిస్తూ రిజర్వేషన్లను పారదర్శకంగా జరపాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులు ఇవ్వడానికి ఉద్దేశించిన సీనియారిటీ జాబితాలో డీఎస్సీ ర్యాంకుల్లో తేడాలున్నాయన్నారు. ర్యాంకులను పునః పరిశీలించి జాబితా తయారుచేయాలన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయి దృష్టిలో ఉంచుకుని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియంతోపాటు, తెలుగు మీడియం ప్రవేశ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు, జిల్లా కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

పేదలకు పూర్వ విద్యార్థుల అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న సుభాన్ బాషా

కడప కార్పొరేషన్: అన్నదానం పుణ్య కార్యమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత సుభాన్‌బాషా అన్నారు. కడప నగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద సీఎస్ఐ స్కూల్ 1978 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని, పేదలు కడుపునిండా భోజనం తింటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్(మున్నా), అబ్దుల్ కరీం, విజయ్ కుమార్, శ్రీనివాసులు, జయ కుమార్, రఫీ, జవహర్‌బాషా పాల్గొన్నారు.

- రంజాన్ మాసంలో ఉమ్రా యాత్ర చేయడం పవిత్ర కార్యమని సుభాన్‌బాషా అన్నారు. స్థానిక గుంతబజార్ లోని తన కార్యాలయంలో ఉమ్రా యాత్రకు వె ళ్తున్న అబ్దుల్ కరీంను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రఫీ, జోహార్ బాషా, అలీ, ఉస్మాన్ ఖాన్, రఫీద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అసౌకర్యం కల్గించవద్దు



వైద్యాధికారితో మాట్లాడుతున్న వీసీ ప్రకాష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులకు వైద్య పరంగా అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని, వారికి అసౌకర్యం కలగకుండా చూడాలని విశ్వవిద్యాలయ వైవీయూ వీసీ ఆచార్య ఫణతి ప్రకాష్ బాబు ఆదేశించారు. వైవీయూలోని ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ల్యాబ్, పరికరాలు పరిశీలించగా.. కేంద్రం అవసరాలను వైద్యాధికారి నరేష్ రెడ్డి వీసీ దృష్టికి తెచ్చారు. అర్థంతరంగా నిలిచిపోయిన ఆరోగ్య కేంద్రం నిర్మాణం వివరాలను ఇంజినీర్ రామచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నూతన భవనానికి వైకాపా ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసిందని, నిధులు పూర్తిగా విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలి



వీసీని సత్కరిస్తున్న కరస్పాండెంట్లు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వ విశ్వవిద్యాలయం పరిధిలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించే కోర్సులను మెరుగుపరచాలని ప్రైవేటు కళాశాలల యాజమాన్య కరస్పాండెంట్లు మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, ఒంటిగారి వెంకటసుబ్బనాయుడు కోరారు. వైవీయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఫణితి ప్రకాష్‌బాబును మంగళవారం వారు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశోధనల్లో, అడకమిక్‌గా సుదీర్ఘ అనుభవం గల వారిని ఉపకులపతిగా నియమించడం శుభ పరిణామం అన్నారు. అనంతరం వీసీ ప్రకాష్‌బాబు వైవీయూ సెనెట్ హాల్లో ప్రైవేటు కళాశాలల కరస్పాండెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి డిగ్రీ కళాశాలల అభివృద్ధి, అవసరాలు, విద్యార్థుల విషయాలపై చర్చించారు.

దంతాల పట్ల జాగ్రత్తలు పాటించాలి



వృద్ధాశ్రమంలో దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు డాక్టర్ భారతి

కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రతి ఒక్కరూ దంత సమస్యల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ సత్వరమే వైద్య సేవలు పొందాలని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ భారతి తెలిపారు. కడప నగర శివారులోని రామకృష్ణ వాన ప్రస్థాశ్రమంలో రిమ్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతి మాట్లాడుతూ చాలా మంది ప్రజలు దంతాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారన్నారు. ప్రతి నెలా తాము ఆరు క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. కడప అర్బన్ హెల్త్ సెంటర్‌తోపాటు నాగరాజుపేట, పక్కీరుపల్లె, ఎర్రముక్కపల్లె, దేవునికడప తదితర ప్రాంతాల్లోని వృద్ధాశ్రమాల్లో శిబిరాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం డాక్టర్ భారతి దంత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ వైద్యులు ఎస్ఎం కావేరి, లీలావతి, హర్షవర్ధన్, చంద్రమౌళి, శకుంతల, లిఖితరెడ్డి, సౌమ్య, ఆశ్రమ సెక్రటరీ సుబ్బరెడ్డి, ట్రెజరర్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.